క్లుప్తంగా

ఉపాధి హామీ పనుల తనిఖీ



మస్టర్లు పరిశీలిస్తున్న ఏపీఓ షమీర్ బాషా

వలేటివారిపాలెం: మండలం కేంద్రమైన వలేటి వారిపాలెం ఉపాధి హామీ పనులను ఏపీఓ షమీర్ బాషా అకస్మాత్తుగా తనిఖీ చేశారు. అనంతరం మస్టర్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మస్టర్ల శాతం పెంచేలా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు. వేసవికాలం వల్ల ఎండలు విపరీతంగా ఉన్నాయని కూలీలు త్వరగా వచ్చి ఎండలు ఎక్కువయ్యేలోపు పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు. జాబ్ కార్డు లేనివారు కార్యాలయంకు వచ్చి దరఖాస్తు చేసుకుంటే జాబ్ కార్డు అందజేస్తామని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్, మెట్లు అనిల్, కిషోర్ ఉన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

లింగసముద్రం: మండలంలోని అన్నెబోయిన పల్లె సచివాలయం పరిధిలోని అంగిరేకులపాడులో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ శేషుబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ (బి)కి కేటాయించినట్లు చెప్పారు. శుక్రవారం లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలని.. 19న ఇంటర్వ్యూ నిర్వహిస్తామని చెప్పారు.

కేజీబీవీ ఎస్‌ఓగా సజన

పామూరు: పామూరు కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం ఎస్‌ఓగా కె.సజన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఓ మాట్లాడుతూ పాఠశాలను అభివృద్ధి పథంలో నడిపి విద్యాసంవత్సరంలో మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేస్తామన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా కేజీబీవీలో వసతులు, విద్యాబోధన ఉంటుందని, పేదవిద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉలవపాడు: మండల పరిధిలో ఖాళీ గా ఉన్న వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు యంపీడీఓ చెంచమ్మ తెలిపారు. మండల పరిధిలో 5 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. చాగల్లు సీ 24 (యస్‌టీ మహిళ), చాకిచర్ల సీ 22 (బీసీ జనరల్), కరేడు 1సీ 5 (ఓసీ మహిళ) రామాయపట్నం సీ11 (యస్సీ జనరల్). ఉలవపాడు సీ 16. బీసీ డీ జనరల్‌కు కేటాయించినట్లు తెలిపారు. 16 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

సొసైటీ చైర్మన్‌కు నేతల పరామర్శ



మలినేనిని పరిమర్శిస్తున్న అశోక్‌బాబు

సింగరాయకొండ: రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై చికిత్స పొందుతున్న కనుమళ్ల సొసైటీ చైర్మన్ మలినేని వెంకటేశ్వర్లును గురువారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పరామర్శించారు. కనుమళ్ల పంచాయతీ పెద్ద కనుమళ్లలోని మలినేని నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు ఏపీఎస్ ఆర్టీసీ నెల్లూరు జోన్ చైర్మన్ బత్తుల సుప్రజరెడ్డి మలినేనిని పరామర్శించారు. నాయకులు, కార్యకర్తలు వారి వెంట ఉన్నారు.

కామేపల్లి రోడ్డులో అగ్నిప్రమాదం

కొండపి: స్థానిక పినాకిని బ్యాంకు ఎదురు కామేపల్లి రోడ్డులో గురువారం భాస్కరుని ప్రసాద్‌కు చెందిన పెంకుల ఇంట్లో అగ్నిప్రమాదం సంభవించింది. హోల్‌సేల్ వ్యాపారం చేసే ప్రసాద్ ఇంట్లో సరుకులతోపాటు పాత అట్ట పెట్టెలు నిల్వ ఉంచారు. ఆ ఇంట్లో ఎవరూ నివాసం ఉండటం లేదు. ఇంటి నుంచి పొగలు వస్తుండటంతో ఇరుగుపొరుగు వారు చూసి ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు.

ఘనంగా నాగార్పమ్మ కొలుపులు

సింగరాయకొండ: మండలంలోని శానంపూడి గ్రామంలో గురువారం నాగార్పమ్మ కొలుపుల వేడుకల్లో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వరికూటికి ఘన స్వాగతం పలికారు. అన్నదాన కార్యక్రమంలో వరికూటి పాల్గొన్నారు. యన్నాబత్తిన చిన్నా, యన్నాబత్తిన కార్తీక్, గ్రామ సర్పంచ్ బల్లెకూర బ్రహ్మయ్య, ఉప సర్పంచ్ కోడిపల్లి రాంబాబు, మాదాల నారాయణ, గ్రామ సచివాలయ కన్వీనర్లు అడకా శ్రీరాములు, ఆదిపోగు చిన్నా, పంతగాని నరశింహారావు, కోడిపల్లి మాధవ, వీరముని, రావినూతల ఏడుకొండలు, బల్లెకూర ప్రభాకర్, పిట్టా బ్రహ్మయ్య, జి.శ్రీహరి రెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ తన్నీరు సుబ్బారావు, బి.మురళి, జి యువరాజ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రావణమాసంలో అంకమ్మతల్లి ఆలయ ప్రారంభం

- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి



నగదు పురస్కారాలు అందిస్తున్న ఎమ్మెల్యే మహీధర్ రెడ్డి, సబ్ కలెక్టర్ శోభిక

కందుకూరు: రానున్న ఆగస్టు నెలలోపు అంకమ్మతల్లి ప్రధాన ఆలయ నిర్మాణ పనులు పూర్తి చేసి శ్రావణమాస ముహూర్తాల్లో నూతన ఆలయాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక అంకమ్మతల్లి ఆలయంలో మాట్లాడారు. రూ. 4కోట్లతో అమ్మవారి గర్భగుడితో పాటు, ప్రదక్షిణ మండపం, ఉపాలయాల నిర్మాణం జరుగుతున్నాయన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి రూ. 30లక్షల వరకు ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు.

ఇప్పటి వరకు రూ. 3.30 కోట్లు

ఆలయ నిర్మాణంలో ఇప్పటి వరకు జరిగిన పనుల కోసం రూ. 3.30కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. విరాళాల రూపంలో రూ. 2,88,58,041 వచ్చాయన్నారు. బీజాక్షరాల యంత్రం కోసం 450 గ్రాముల బంగారాన్ని భక్తులు ఇచ్చారని తెలిపారు. ప్రధాన ఆలయ నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు శిల్పితో రూ. 4కోట్లకు ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. ఇంకా రూ. 1కోటి వరకు అదనంగా ఖర్చు అయ్యే అవకాశం ఉందని, వీటిలో రూ. 90 లక్షలు దేవాదాయశాఖ నుంచి రావాల్సి ఉందన్నారు. పునఃనిర్మాణ కమిటీ సభ్యులు యనిమిరెడ్డి వెంకటరెడ్డి, పిడికిటి వెంకటేశ్వర్లు, గాండ్ల శ్రీనివాసులు, గ్రామదేవతల వంశపారంపర్య ధర్మకర్త దివి లింగయ్యానాయుడు తదితరులు పాల్గొన్నారు.

దేశానికే మార్గదర్శకం

కందుకూరు రూరల్: విద్యావ్యవస్థలో దేశానికే మార్గదర్శకంగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తోందని ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో మాట్లాడారు. నాడు– నేడు పథకం దేశవ్యాప్తంగా అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా చర్యలు చేపట్టడం గర్వకారణమన్నారు.

పదో తరగతి ఫలితాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన తరుణ్ తేజ, వెంకటలక్ష్మిస్వాతి, వసంత కృష్ణ, ఇంటర్ కు సంబంధించి మాధురి, ఇస్రాత్, సైదాబీజైస్వాల్‌కు ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్ చేతుల మీదుగా నగదు పురస్కారాలు అందచేశారు. సబ్ కలెక్టర్ శోభికతో పాటు జెడ్పీటీసీలు అనసూర్య, భారతి, బాపిరెడ్డి, ఎంపీపీలు సుశీల, కృష్ణయ్య, మౌనిక, పులిరమేష్, మస్తానమ్మ, డిప్యూటీ ఈఓ శ్రీనివాసరావు, యంఈఓ వెంకటేశ్వర నాయక్ పాల్గొన్నారు.

రైతులకు సకాలంలో విత్తనాల సరఫరా



ధరల స్థిరీకరణ నిధి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మానుగుంట

కందుకూరు: ఖరీఫ్ సీజన్‌కు రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయడంతో పాటు, రైతుల అవసరాల మేరకు విత్తనాలు అందుబాటులో ఉంచే విధంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో జరిగిన ధరల స్థిరీకరణ నిధి సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో చేసిన తీర్మానాలను జిల్లా స్థాయిలో జరిగే వ్యవసాయ సలహా మండలి సమావేశంలో చర్చిస్తామని, దీని ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరుగుతుందన్నారు. పత్తి, శనగ పంటల మద్దతు ధరలను కనీసం రూ. 8వేలకు పెంచాలని సిఫార్సు చేస్తామన్నారు. రైతులు ప్రత్యామ్నాయ ఆదాయం కూడా వస్తుందని స్పష్టం చేశారు.

తప్పులు సరిచేసుకోవాలి

ఏడీఏ అనసూయ మాట్లాడుతూ నియోజకవర్గానికి రైతు భరోసా కింద రూ. 19.4 కోట్ల వరకు వచ్చాయని, అయితే 656 మంది రైతుల ఆధార్‌కార్డుల్లో పేర్లు తప్పుగా ఉండడం వల్ల నిలిచిపోయాయని చెప్పారు. ఈ తప్పులను సరిచేసుకునేందుకు మరో రెండు రోజుల గడువు మాత్రమే ఉందని తెలిపారు. వివిధశాఖల అధికారులు, వ్యాపారులు, రైతులు పాల్గొన్నారు.

పండ్ల తోటలతో అధిక ఆదాయం



మాట్లాడుతున్న హార్టికల్చర్ అధికారి తేజ

టంగుటూరు: ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో రైతులు పండ్ల తోటలు సాగు చేస్తే అధిక ఆదాయం పొందవచ్చని ఉద్యానశాఖ అధికారి తేజ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీఓ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యానశాఖాధికారి మాట్లాడుతూ.. పంచాయతీ తీర్మానం పొందిన సన్న, చిన్నకారు రైతులను పండ్ల తోటల సాగుకు ఎంపిక చేయాలన్నారు. మామిడి, నిమ్మ, జామ, డ్రాగన్ ఫ్రూట్, అలాగే మల్లె, గులాబీ తోటలు సాగు చేసే రైతులకు రాయితీలు అందిస్తున్నట్లు చెప్పారు. మండలంలో పండ్ల తోటలకు అనువైన నేలలు కందులూరు, మర్లపాడు, కారుమంచి, కాకుటూరివారిపాలెం, జయవరం, టంగుటూరు, మల్లవరప్పాడు, వల్లూరు గ్రామాల్లో లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లు, వీఏఏ, హార్టికల్చర్ అసిస్టెంట్లకు సూచించారు. వ్యవసాయాధికారి స్వర్ణలత, ఏపీఓ సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న వరికూటి అశోక్‌బాబు

- నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు

జరుగుమల్లి(సింగరాయకొండ): పేదల అభ్యున్నతి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయో లేదో తెలుసుకుని అర్హులకు న్యాయం చేసేందుకే గడప గడపకు వస్తున్నామని చెప్పారు. గురువారం జరుగుమల్లి మండలం కె.బిట్రగుంట పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వరికూటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో సుమారు 1.02 లక్షల గడపలు ఉంటే తాను ఇప్పటి వరకు 90 వేల గడపలు పైగా తిరిగానని, ప్రజలు తెలియజేసిన సమస్యల్లో కొన్ని తక్షణమే, మరికొన్ని ప్రాధాన్య క్రమంలో పరిష్కరించానని పేర్కొన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పెత్తనం చెలాయించిన జన్మభూమి కమిటీలు అర్హత లేని వారికి ప్రభుత్వ పథకాలు కట్టబెట్టాయని విమర్శించారు. టీడీపీ ఎమ్మెల్యే స్వామి మరుగుదొడ్లు నిర్మించినట్లు బిల్లులు చేసుకుని రూ.22 కోట్లు స్వాహా చేశాడని ఆరోపించారు. చంద్రబాబు ఎన్ని కల్లబొల్లి మాటలు చెప్పినా ప్రజలు విశ్వసించరని, విశ్వసనీయత అనేది ఒక్క జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమన్నారు. ఎందుకంటే జగనన్న చెప్పిందే చేస్తారని వరికూటి కొనియాడారు. పార్టీ నిబంధనలు అతిక్రమించేవారు క్రమశిక్షణ చర్యలకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు.

పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి డాకా పిచ్చిరెడ్డి, కుండా చెంచురెడ్డి, నల్లపురెడ్డి భాస్కరరెడ్డి, కొత్తపల్లి వెంకారెడ్డి, నల్లపురెడ్డి శ్రీనివాసులరెడ్డి, కుమ్మరిగుంట అనిల్, కాకి జయపాల్, పంచాయతీ కార్యదర్శి షేక్ షఫీ, మార్కెట్ యార్డు మెంబరు పల్లాల శివకోటిరెడ్డి, గ్రామ సచివాలయ అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

- గిద్దలూరు ఏడీఏ బాలాజీ నాయక్



తనిఖీలు చేస్తున్న స్క్వాడ్ అధికారులు

కనిగిరి రూరల్: పట్టణంలోని విత్తనాల, ఎరువుల దుకాణాలను వ్యవసాయ అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. దాడుల్లో స్క్వాడ్ అధికారి గిద్దలూరు సహాయ వ్యవసాయ సంచాలకులు డీ బాలాజీ నాయక్, పాటు వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు. పట్టణంలోని న్యూ రైతు డిపోలో విత్తన దుకాణం గోదాము లైసెన్స్‌లో పొందపర్చక పోవడంతో సుమారు రూ.90 వేల విలువైన విత్తన అమ్మకాలను నిలుపుదలకు ఆదేశాలిచ్చారు. వాసవీ ఫర్టిలైజర్స్‌లో రికార్డులు సక్రమంగా లేనందున షోకాజ్ నోటీసులు జారీ చేశారు. కార్యక్రమంలో ఏఓ పి.జోత్స్న దేవి, టెక్నికల్ ఏఓ ఎస్‌కే బాషా, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

టంగుటూరు: గ్రామీణాభివృద్ధి, స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి స్థానిక ఏపీఎం కార్యాలయంలో గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒంగోలు భాగ్య నగర్‌లో జూలై 3 నుంచి ఆగస్టు ఒకటో తేదీ వరకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ కాలంలో భోజనం, వసతి పూర్తిగా ఉచితమని, జిల్లాకు చెందిన 19 నుంచి 45 ఏళ్ల మధ్య వయసున్న మహిళలు మాత్రమే అర్హులని స్పష్టం చేశారు. వివరాలకు 9573363141ను సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులను ప్రభుత్వ కళాశాలలో చేర్పించండి



నాగిరెడ్డిసపాలెంలో ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

పొన్నలూరు: మండలంలో పదో తరగతి పూర్తయిన విద్యార్థులను వారి తల్లిదండ్రులు పొన్నలూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో చేర్పించాలని ప్రిన్సిపాల్ ఎస్‌కే రషీద్ కోరారు. మండలంలోని నాగిరెడ్డిపాలెం, పొన్నలూరు గ్రామాల్లో గురువారం కళాశాల సిబ్బంది అడ్మిషన్ల కోసం కరపత్రాలతో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో నైతిక విలువలతో కూడిన విద్య అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు వేలకు వేలు ఫీజులు చెల్లించి కార్పొరేట్ కళాశాలల్లో చేరకుండా నాణ్యమైన విద్య బోధించే ప్రభుత్వ కళాశాల్లో చేరాలని సూచించారు. పక్కా భవనంతో పాటు అన్ని రకాల వసతులను రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ వై.జాన్‌బాబు, వాసుబాబు, జిలానీబాష, రాజు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో నాణ్యమైన విద్య

కనిగిరి రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన విద్యతో పాటు, పౌష్టికాహారం అందచేస్తున్నట్లు సీడీపీఓ సరోజని అన్నారు. మాచవరం సెక్టార్ పరిధిలోని ఏరువారిపల్లిలో గురువారం జన భాగి దారి కార్యక్రమంపై అవగాన, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ సరోజని ప్రభుత్వం అంగన్ వాడీ కేంద్రాల్లో అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. జూలై నుంచి గర్భిణులు, బాలింతలకు ఇంటింటికీ రేషన్, పౌష్టికాహార సరుకులు అందజేస్తామన్నారు. సర్పంచ్ దమ్ము వెంకటయ్య, సూపర్ వైజర్ మల్లేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మూడున్నర ఎకరాల్లో సరుగుడు చెట్లు దద్ధం

గుడ్లూరు: నిప్పురవ్వలు అంటుకుని మూడున్నర ఎకరాల్లో సరుగుడు చెట్లు దద్ధమైన సంఘటన మండ కేంద్రమైన గుడ్లూరులో బుధవారం రాత్రి జరిగింది. గ్రామంలోని రెడ్డిపాలేనికి చెందిన రామాల సుబ్బరామిరెడ్డి లనే రైతు ఉప్పుటేరు అవతల మూడున్నర ఎకరాల్లో సరుగుడు చెట్లు సాగుచేస్తున్నాడు. బుధవారం రాత్రి పొలం మీదుగా పోతున్న విద్యుత్ వైర్లు రాపిడి జరిగి నిప్పురవ్వలు కిందపడటంతో అంటుకుని మంటలు చెలరేగాయి. మూడున్నర ఎకరాల్లో ఉన్న సరుగుడు చెట్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. రూ.6 లక్షల నష్టం వాటాల్లినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

ప్రీ ప్రైమరీ విద్యతో బంగారు భవిష్యత్



ర్యాలీ చేస్తున్న హెచ్‌ఎం, ఐసీడీఎస్, స్వచ్ఛంద సంస్థలు

పామూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో బోధిస్తున్న ప్రీ ప్రైమరీ విద్యతో చిన్నారుల భవిష్యత్‌కు బంగారు బాట పడనుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ, ఎంపీఎస్ పార్వతి అన్నారు. పామూరుతో పాటు మండలంలోని వగ్గంపల్లె లో గురువారం జనభాగస్వామ్య కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రీప్రైమరీ పూర్తిచేసుకున్న చిన్నారులకు ఆయా కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి వారికి ధృవీకరణ పత్రాలు అందజేసి వారిని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ స్థాయి నుంచి ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నతవిద్యా రంగంలో తీసుకువచ్చిన సమూల మార్పులు పేద విద్యార్థులకు వరంగా మారాయన్నారు. నాడు– నేడు, అమ్మఒడి, వసతిదీవెన, విద్యాదీవెన, జగనన్న విద్యాకానుక పథకాలు విద్యారంగాభివృద్ధికి మూలస్తంభాలుగా ఉన్నాయన్నారు. హెచ్‌ఎం పద్మావతి, సర్పంచ్ దేవనబోయిన సుబ్బయ్య, ఎన్‌జీఓ నాయబ్‌రసూల్ పాల్గొన్నారు.

అచ్చమాంబ బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో అచ్చమాంబ మూల విగ్రహమూర్తి

పామూరు: మండలంలోని రఘునాథపురం, కమ్మవారిపాలెంలో అచ్చమాంబ పేరంటాళ్ల బ్రహ్మోత్సవాలు గురువారం రుత్వికుల వేదమంత్రాల నడుమ ఘనంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు కె.రవికిరణ్‌శర్మ ఆలయంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, కలశస్థాపన, అగ్నిప్రతిష్ట నిర్వహించారు. అచ్చమాంబ మూల విగ్రహమూర్తికి పంచామృతాభిషేకం, కుంకుమ పూజలు చేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా అమ్మవారికి గ్రామోత్సవం, భజన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అన్నదానం నిర్వహించగా దేవస్థానాన్ని ప్రత్యేక విద్యుద్దీపాలంకరణతో శోభాయమానంగా తీర్చిదిద్దారు.

వృద్ధులను వేధిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: పిల్లలు తల్లిదండ్రులను, వయో వృద్ధులను వేధించినా, నిర్లక్ష్యం చేసి, హింసించినా వారిపై పోషణ, సంరక్షణ చట్టం 2007 ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని మున్సిపల్ చైర్మన్, న్యాయవాది ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. హెల్ప్ ఏజ్ ఇండియా ఆధ్వర్యంలో స్థానిక వృద్ధుల ఆశ్రమంలో ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వం వృద్ధులకు అనేక సంక్షేమ పథకాలను అందచేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సయ్యద్ యాసీన్, ఆశ్రమం నిర్వాహకుడు రంగనాయకులు, హెల్ప్ ఏజ్ ఇండియా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన

వెలిగండ్ల: క్షయవ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ టి.సుకుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ క్షయ నిర్మూలనకు ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా సత్వర చికిత్సలు తీసుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణకు అధునాతన పరీక్షలు అందుబాటులో ఉన్నాయన్నారు. హెచ్‌ఐవీతో బాధపడే వారికి క్షయవ్యాధి సోకే ప్రమాదం ఎక్కువగా ఉందన్నారు. క్షయవ్యాధి సోకిన రోగులు క్రమం తప్పకుండా మందులు వాడాలన్నారు. సర్పంచ్ టి.సురేష్‌బాబు, డాక్టర్ ఫిరోజ్, క్షయవ్యాధి నిర్మూలన అధికారి యెండ్లూరి బాబూరావు, వైఎస్సార్ సీపీ నాయకులు యెలికె నారాయణ పాల్గొన్నారు.

దశల వారీగా సమస్యలు పరిష్కరిస్తాం

కనిగిరి రూరల్: దశల వారీగా అన్ని వార్డుల్లో సమస్యలు పరిష్కరిస్తానని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని 5వ వార్డులోని వడ్డెరపాలెంలో గురువారం సమస్యపరిష్కారం కార్యక్రమంలో భాగంగా చైర్మన్ గఫార్, వైస్ చైర్మన్ మాణిక్యరావు, వార్డు కౌన్సిలర్ దేవరాజ్ పర్యటించారు. స్థానికులు రోడ్లు, మురికి నీటి కాలువలు, విద్యుత్ దీపాలు తదితర సమస్యలను చైర్మన్‌కు విన్నవించారు. వడ్డెర కాలనీలో తక్షణ చర్యగా డ్రైనేజీ కాలువను నిర్మిస్తానని చైర్మన్ తెలిపారు. తక్షణ పారిశుధ్య చర్యలు చేపట్టారు. స్థానిక నాయకులు, ఏఈ, సచివాలయ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందజేత



దేవయ్యకు ట్రైసైకిల్ అందిస్తున్న చింతపల్లి హరిబాబు, నాయకులు

టంగుటూరు: కొండపి మండలం మిట్టపాలెం గ్రామానికి చెందిన గడ్డం దేవయ్యకు గురువారం వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు నేతృత్వంలో ఆ పార్టీ నాయకులు ట్రైసైకిల్ అందజేశారు. పక్షవాతం సమస్యతో నడవలేక ఇబ్బంది పడుతున్న దేవయ్య పరిస్థితిని అశోక్‌బాబుకు ఆ గ్రామ నాయకుడు పోకూరి కోటయ్య ఇటీవల వివరించారు. ఈ మేరకు జిల్లా అధికారులతో మాట్లాడి ట్రైసైకిల్ మంజూరు చేయించగా కందులూరు గ్రామంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో సర్పంచి పసుమర్తి ఈశ్వరమ్మ, మన్నం వెంకయ్య, ఉప్పలపాటి రామరాజు, పాటిబండ్ల కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు సరాసరి ధర రూ.232

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం సరాసరి ధర కేజీ రూ.232 పలికింది. కమ్మవారిపాలెం, కట్టుబడిపాలెం గ్రామాల రైతులు 861 బేళ్లను వేలానికి తీసుకురాగా 826 కొనుగోలయ్యాయి. 35 పొగాకు బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. గరిష్ట ధర రూ.240 కాగా, కనిష్ట ధర రూ.161 పలికింది. వేలంలో మొత్తం 28 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

814 బేళ్ల కొనుగోలు

కందుకూరు: కందుకూరు –2 వేలం కేంద్రంలో జరిగిన పొగాకు వేలంలో 904 బేళ్లు వేలానికి ఉంచగా 814 బేళ్లు అమ్ముడుపోయాయి. కేజీ అత్యధిక ధర రూ. 240 రాగా, అత్యల్ప ధర రూ. 160 పలికింది. గోడౌన్ నిండిపోవడంతో ఒకటో వేలం కేంద్రంలో గురువారం వేలం నిలిపివేశారు. ఖాళీ చేసిన తరువాత యథావిధిగా వేలం నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

వైఎస్సార్ పశువుల బీమాపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న డీడీ వెంకటసుబ్బయ్య, పాల్గొన్న పశుపోషకులు

పామూరు: వైఎస్సాఆర్ పశువుల బీమా పథకంపై పశుపోషకులు అవగాహన కలిగి ఉండి పథకాన్ని వినియోగించుకోవాలని పశుసంవర్ధకశాఖ మార్కాపురం డీడీ వెంకటసుబ్బయ్య అన్నారు. మండలంలోని తిరగలదిన్నెలో గురువారం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో వైఎస్సార్ పశువుల బీమా పథకంపై డాక్టర్ ఈమని శ్రీసాయి అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా డీడీ వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ పశువుల బీమా కోసం పశుపోషకులు నిర్దేశిత మొత్తాన్ని చెల్లించాలన్నారు. పాడిపశువులు, ఆవులు, గొర్రెలు, మేకలు తదితర జీవాలు రోగాలవల్ల, రోడ్డుప్రమాదం, పాముకాటు, ప్రకృతి వైపరీత్యాల వల్ల మృతి చెందితే బీమా పరిహారం పొందవచ్చన్నారు. తెల్లరేషన్‌కార్డు ఉన్న వారికి బీమా చెల్లింపు రాయితీ ఉంటుందన్నారు. రైతులు కిసాన్ క్రెడిట్ కార్డుతో బ్యాంకుల నుంచి రు.25 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు రుణం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సీఎస్‌పురం ఏడీ రమేష్, సర్పంచ్ పిన్నిక వెంకట రమణమ్మ, గోళ్ల వెంకటేశ్వర్లు, పిన్నిక రత్తయ్య, వెటర్నరీ అసిస్టెంట్ ఖాదర్‌బాషా, పశుపోషకులు పాల్గొన్నారు.



